# మైనార్టీల సంక్షేమానికి ప్రతి ఏటా రూ.2,200 కోట్లు


మైనార్టీల ఆత్మీయ సమ్మేళనంలో ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య

- కాంగ్రెస్ హయాంలో కేవలం రూ.200 కోట్లు మాత్రమే..
- చేవెళ్ల అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జి, చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి

మొయినాబాద్, అక్టోబర్ 17 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి ప్రతి ఏటా రూ.2,200 కోట్లు ఖర్చు చేస్తున్నదని చేవెళ్ల అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జి, చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. మంగళవారం మొయినాబాద్ మండల పరిధిలోని ఎన్కేపల్లి గ్రామంలో ఉన్న ఎంపీ క్యాంప్ ఆఫీస్‌లో మైనార్టీ సోదరులు, ఎమ్మెల్యే అభ్యర్థి కాలె యాదయ్యతో కలిసి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత రాష్ట్రంలో మత కలహాలు నియంత్రించబడ్డాయని, ముస్లింలు ఆత్మగౌరవంతో బతికేలా బీఆర్ఎస్ సర్కార్ కృషి చేస్తున్నదని చెప్పారు. మైనార్టీల సంక్షేమం కోసం కాంగ్రెస్ పాలనలో కేవలం రూ.200 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. మైనార్టీల పట్ల ఏ పార్టీకి చిత్తశుద్ధి ఉందో గ్రహించాలన్నారు. మైనార్టీల కోసం పని చేసే ప్రభుత్వాన్ని మాత్రమే ఎన్నుకోవాలని సూచించారు. ప్రతి పేద ముస్లిం ఆడబిడ్డ పెళ్లికి ఆర్థిక సాయం అందించాలనే గొప్ప ఆలోచనతో సీఎం కేసీఆర్ షాదీముబారక్ పథకాన్ని ప్రవేశపెట్టిందని ఎంపీ తెలిపారు. మైనార్టీలు ఆర్థికంగా బలోపేతం కావడం కోసం మైనార్టీ బంధు పథకం కింద రూ.లక్షల సాయం అందిస్తున్నదని చెప్పారు. మైనార్టీల పిల్లలు కూడా విద్యావంతులు కావాలనే ఆలోచనతో రాష్ట్రంలో ప్రత్యేకంగా మైనార్టీ గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యను అందిస్తున్నదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లో ఎప్పుడు గొడవలు జరుగుతాయోనని భయంభయంతో ముస్లింలు జీవించేవారని గుర్తుచేశారు. శాంతి భద్రతలు, మైనార్టీల సంక్షేమం కోసం పని చేసే ప్రభుత్వానికి అండగా మైనార్టీ సోదరులు ఉండాలని ఎంపీ కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రమణారెడ్డి, కృష్ణారెడ్డి, మైనార్టీ నేతలు అలీ, జహంగీర్, బాసిత్, జాహెద్, ఖాదర్ పాల్గొన్నారు.

## రూ.50వేలకు మించి నగదు తీసుకెళితే సీజ్

### కలెక్టర్ భారతి హోలీకేరీ


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ భారతి హోలీకేరీ

ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 17 : ఎన్నికల నియమావళి అమలులో వచ్చినందున జిల్లాలో ప్రజలు రూ.50వేలకు మించి నగదు తమ వెంట తీసుకెళ్లరాదని, ఒకవేళ అత్యవసర పరిస్థితుల్లో తీసుకెళ్లాల్సి వస్తే తగిన ఆధారాలు కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోలీకేరీ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశ మందిరంలో ఆమె వివిధ బ్యాంకుల అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చినందున అధికారులు ఎన్నికల నిబంధనలకు లోబడి పని చేయాలని తెలిపారు. ఒక ఖాతా నుంచి ఎక్కువ ఖాతాలకు నగదు బదిలీ చేసినా, చాలా ఖాతాల నుంచి ఒకే ఖాతాకు నగదు బదిలీ అయినా వెంటనే సమాచారాన్ని ఎన్నికల అధికారికి అందించాలన్నారు. సాధారణ ప్రజలు తమ బ్యాంకు ఖాతాల్లో రూ.10 లక్షలు.. అంతకు మించి నగదు జమ చేసినా.. తీసుకున్న వివరాలను సంబంధిత శాఖ నోడల్ అధికారికి తెలియజేయాలన్నారు. ఎన్నికల్లో పాల్గొనే అభ్యర్థులు తమ ఎన్నికల వ్యయం కోసం ప్రత్యేకంగా ఒక ఖాతా తెరువాలని, ఆ ఖాతాను అభ్యర్థి స్వతహాగా, సంయుక్త ఎన్నికల ఏజెంట్‌తో కలిసి తెరువాలని, అభ్యర్థి కుటుంబ సభ్యులతో కలిసి ఖాతా తెరువరాదని తెలిపారు. అభ్యర్థి తన ఎన్నికల వ్యయాన్ని చెక్‌ద్వారా, ఆర్‌టీజీఎస్, నెఫ్ట్ ద్వారా బదిలీ చేసుకోవచ్చన్నారు. ఎన్నికల సమయంలో నగదు రూ.20వేలకు మించి ఆ ఖాతా నుంచి ఇవ్వరాదన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, జిల్లా ఎన్నికల అధికారులు, బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి షాట్‌పుట్ పోటీల్లో కొడంగల్ క్రీడాకారుడికి

# పసిడి పతకం


పోటీల్లో బంగారు పతకంతో సాయికిరణ్

కొడంగల్, అక్టోబర్ 17 : హన్మకొండ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నేషనల్ సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఈ నెల 15 నుంచి 17 వరకు జరిగాయి. ఈ పోటీల్లో షాట్‌పుట్‌కు సంబంధించి కొడంగల్ మండలం హస్నాబాద్ గ్రామానికి చెందిన క్రీడాకారుడు సాయికిరణ్ ప్రథమ స్థానాన్ని పొంది బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలువురు సాయికిరణ్‌ను అభినందించారు.

## బంగారు భవిష్యత్‌కు బాటలు వేద్దాం

### ఎన్ఐఆర్డీ మాజీ డైరెక్టర్ ఆఫ్ జనరల్ రాంపుల్లారెడ్డి


శిక్షణ పొందిన ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు అందజేసిన నిర్వాహకులు

కడ్తాల్, అక్టోబర్ 17 : ఉపాధ్యాయులు విద్యార్థులకు చదువు యొక్క ప్రాముఖ్యతను తెలియజేసి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని ఎన్ఐఆర్డీ మాజీ డైరెక్టర్ ఆఫ్ జనరల్ రాంపుల్లారెడ్డి అన్నారు. మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామంలో గల ఎర్త్ సెంటర్‌లో మూడు రోజులుగా కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్–ఎస్‌కే చారిటబుల్ ట్రస్టు సంయుక్తంగా నిర్వహిస్తున్న 'ఉదాత్త జీవితం–ఉన్నత లక్ష్యం'పై బడి ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాంపుల్లారెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదివి జీవితంలో అత్యుత్తమ స్థాయికి ఎదగాలని పేర్కొన్నారు. సేవా దృక్పథం కలిగిన సామాజికవేత్తలు ముందుకు రావడం శుభపరిణామమన్నారు. మంచి విలువలతో కూడిన విద్యను అందించి తరగతి గదులే దేశ భవిష్యత్‌కు పునాది అన్న అబ్దుల్‌కలాం మాటలను నిజం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం శిక్షణా శిబిరంలో పాల్గొన్న ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో సీజీఆర్ సంస్థ వ్యవస్థాపకులు లీలమ్మ, లక్ష్మారెడ్డి, సమాచార హక్కు మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి, ఇంజినీరింగ్ మేనేజ్‌మెంట్ మైక్రోసాఫ్ట్ ప్రిన్సిపాల్ రవికాంత్, వ్యవస్థాపక పర్యావరణవేత్త డాక్టర్ సాయిభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఎక్కడికక్కడ నిఘా..

- ప్రతి నియోజకవర్గంలో క్షుణ్ణంగా పరిశీలిస్తున్న ఎన్నికల బృందాలు
- ఎప్పటికప్పుడు అభ్యర్థుల ఖర్చుపై వివరాలు సేకరిస్తున్న ఎన్నికల సంఘం
- అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థుల ఖర్చు గతంలో రూ.28 లక్షలుండగా.. రూ.40 లక్షలకు పెంచుతూ నిర్ణయం
- ఈ దఫా ఎన్నికల్లో తినుబండారాలతోపాటు, ఎన్నికల ప్రచార సామగ్రి ధరలను పెంచిన ఎన్నికల అధికారులు



పరిగి నియోజకవర్గం రాఘవపూర్ పోలీస్ చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు(ఫైల్)

వికారాబాద్, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ) : నవంబర్ 30న జరుగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేస్తున్నది. ఇప్పటికే జిల్లాకు సరిపడా ఈవీఎంలను సిద్ధం చేయడంతోపాటు మాక్ పోలింగ్ కూడా నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ బాధ్యతను సక్రమంగా నిర్వహించేందుకు జిల్లాలోని ఎన్నికల సిబ్బందికి త్వరలో శిక్షణనిచ్చేందుకు ఇప్పటికే మాస్టర్ ట్రైనర్లకు శిక్షణా కార్యక్రమం పూర్తి చేశారు. ఎన్నికల వేళ డబ్బు, మద్యం ప్రవాహాన్ని ఎక్కడిక్కడ కట్టడి చేసేందుకు జిల్లా అంతటా చెక్‌పోస్టులను ఏర్పాటు చేయడంతోపాటు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలతో ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ దఫా ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు చేసే ఖర్చుపై కూడా ఎన్నికల అధికారులు నిఘా పెట్టారు. ప్రతి రోజూ ఏ పార్టీ అభ్యర్థి ప్రచారంలో భాగంగా ఏయే ఖర్చులు పెడుతున్నారనే దానిపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ ఇప్పటికే విడుదల చేయగా, మరో పదిహేను రోజుల్లో నోటిఫికేషన్ జారీతో పాటు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభంకానున్న నేపథ్యంలో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులపై ఎన్నికల సంఘం నిఘా పెట్టింది. ఏ అభ్యర్థి కూడా ఎన్నికల సంఘం నిర్ణయించిన దానికి మించి ఖర్చు చేయకుండా.. అభ్యర్థుల ఖర్చులపై నిఘా పెట్టడంతోపాటు ఎప్పటికప్పుడు అభ్యర్థుల ఖర్చుల వివరాలను రాష్ట్ర ఎన్నికల సంఘానికి అందజేస్తున్నారు. ఎన్నికల్లో ఏ పార్టీ అభ్యర్థి ఎంతమేర ఖర్చు చేసారనేది ఆన్‌లైన్‌లో తెలిసేవిధంగా ప్రత్యేక వెబ్‌సైట్‌లో పొందుపర్చనున్నారు.

### 4 నియోజకవర్గాల్లో ముమ్మర తనిఖీలు

ఎన్నికల్లో ఆయా పార్టీల అభ్యర్థులు డబ్బు, మద్యం తరలించకుండా జిల్లా ఎన్నికల అధికారులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. జిల్లా అంతటా 15 చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడంతో పాటు వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లోని ప్రధాన ప్రాంతాల్లో వాహనాల తనిఖీలను కూడా పోలీసులు ముమ్మరం చేశారు. ముఖ్యంగా కర్నాటక నుంచి మద్యం, డబ్బు తరలించే అవకాశాలున్న దృష్ట్యా అంతర్‌రాష్ట్ర సరిహద్దులోని బషీరాబాద్, కొడంగల్, దౌల్తాబాద్, బంట్వారం మండలాల్లో 8 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి 24 గంటలపాటు నిఘా పెట్టారు. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా రూ.50 లక్షలపైనే నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆయా పార్టీల అభ్యర్థుల ప్రచారంపై కూడా జిల్లా ఎన్నికల అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఆయా పార్టీల అభ్యర్థులకు మద్దతుగా నిర్వహించే సభలతోపాటు ర్యాలీలు, రోడ్‌షోలలో ఖర్చు చేసే కుర్చీల నుంచి ఎల్‌ఈడీ స్క్రీన్లు, భోజనం, టీ, కాఫీ వరకు అంతా క్షుణ్ణంగా పరిశీలిస్తూ అభ్యర్థుల ఖర్చులో ఖాతాలో కలుపుతున్నారు. అభ్యర్థులు చేసే ఖర్చును చూసేందుకు ప్రతి నియోజకవర్గానికి ముగ్గురితో కూడిన ఒక్కో ఆడిట్ బృందాన్ని జిల్లా ఎన్నికల అధికారి నియమించారు. ప్రతి నియోజకవర్గంలో అన్ని పార్టీల అభ్యర్థులు చేసే ప్రచారంపై పూర్తి నిఘా పెట్టి దేనికెంత ఖర్చు పెడుతున్నారో పరిశీలిస్తూ ఎన్నికల అధికారులకు సమాచారాన్ని అందజేస్తున్నారు.

### అభ్యర్థుల ఖర్చు రూ.40 లక్షలుగా నిర్ణయం

సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఏ మేరకు ఖర్చు చేయాలనే దానిపై ఎన్నికల సంఘం నిర్ణయించింది. అభ్యర్థులు ప్రచారం ప్రారంభించిన నాటి నుంచి ప్రచారం ముగిసే వరకు ఆయా పార్టీల అభ్యర్థులు చేసే ఖర్చుకు సంబంధించి ప్రతి పైసా ఎన్నికల అధికారులకు లెక్క చూపించాల్సి ఉంటుంది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ప్రచారం ముగిసే నాటికి రూ.40 లక్షల వరకు ఖర్చు చేయొచ్చని ఈసీ నిర్ణయించింది. గత ఎన్నికల సమయంలో రూ.28 లక్షలుగా నిర్ణయించిన ఎన్నికల సంఘం, ఈ ఎన్నికల్లో రూ.12 లక్షలను పెంచుతూ రూ.40 లక్షలుగా నిర్ణయించింది. తినుబండారాల నుంచి ప్రచార సామగ్రి వరకు అన్ని రాజకీయ పార్టీల నేతలతో చర్చించి వాటి ధరలను నిర్ణయించింది. 2018 ఎన్నికలతో పోలిస్తే ఈ ఎన్నికల్లో తినుబండారాల ధరలతోపాటు ప్రచార సామగ్రి వస్తువుల ధరలను పెంచింది.

### గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో తినుబండారాలతోపాటు ప్రచార సామగ్రి ధరలు(రూ.)

| వస్తువు | గ్రామీణ | అర్బన్ |
|---|---|---|
| టీ | 8 | 10 |
| కాఫీ | 10 | 12 |
| బ్రేక్‌ఫాస్ట్ | 35 | 40 |
| మీల్స్ | 80 | 80 |
| రైస్ ప్లేట్ | 4.50 | 4.50 |
| పులిహోర | 20 | 30 |
| వెజిటేబుల్ బిర్యాని | 100 | 120 |
| చికెన్ బిర్యాని | 140 | 160 |
| మటన్ బిర్యాని | 160 | 180 |
| క్రాకర్స్(1000వాలా) | 800 | 800 |
| బ్యాండ్ ఒక్కరికి | 500 | 500 |
| గోడ ప్రకటనలు (5X10 ఫీట్స్) | 1000 | 1000 |
| స్టేజీ డెకరేషన్ | 2000 | 2000 |
| కుర్చీ | 10 | 10 |
| సోఫా | 200 | 200 |
| ఏసీ ఫంక్షన్ హాల్స్ చైర్లతో కలిపి | 12000 | 15000 |
| నాన్ ఏసీ.. | 8000 | 9000 |
| ఇన్నోవా కారు రోజుకు | 4000 | 4000 |
| ఎస్‌యూవీ | 3000 | 3000 |
| టాటా ఏస్ | 1500 | 1500 |
| డీసీఎం | 3000 | 3000 |
| జీపు | 2000 | 2000 |

వీటితోపాటు డీజే సిస్టమ్, డ్రోన్ కెమెరాలు, హైడ్రోజన్ బెలూన్, ఎల్ ఈడీ స్క్రీన్ల ధరలను ఎన్నికల అధికారులు నిర్ణయించారు.